క్లుప్తంగా

కల్వర్ట్ లేక అవస్థలు



మామిడిపల్లి తుంకిల్ల తండా రోడ్డులో పారుతున్న నీరు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని మామిడిపల్లి నుంచి తుంకిల్లతండా, మామిడిపల్లి తండాకు వెళ్లే దారిలో కల్వర్ట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ నుంచి వచ్చేనీరు రోడ్డుపై పారుతోంది. వర్షాకాలంలో వరదలా పారు తుండటంతో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. కల్వర్ట్ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న గ్రామపెద్దలు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలోని నాగ్‌ధర్ గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ మేతరి లక్ష్మయ్య కుమారుడు రాకేష్ జ్ఞాపకార్థం హ్యాండ్ ఆఫ్ హూప్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 90మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. 100మందికిపైగా ఎక్స్‌రేలను, ఈసీజీలను, 300మందికి ఆయా రక్త పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యం సైతం నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామంలో మొదటిసారి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో ప్రజలు వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిలా మధుకర్, రాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని వావిలాల గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. వావిలాల గ్రామంలోని 189 సర్వేనంబర్ గల ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరపటంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ దశరథ్‌సింగ్ రాథోడ్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం సరికాదని, ఇందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ హెచ్చరించారు.

కనీస వేతనాలు అందక కార్మికుల ఇబ్బందులు


సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య



డీసీఎల్‌కు ఫిర్యాదు చేస్తున్న రాజయ్య తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల్లో కనీస వేతనాలు లేకపోవటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలోని హార్లెక్స్ రబ్బర్ పరిశ్రమలో కనీస వేతనాలు కార్మికులకు ఇవ్వడంలేదని ఆరోపిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం డీసీఎల్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈఎస్‌ఐ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా కృష్ణకాంత్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా తొంట కృష్ణకాంత్ సోమవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో తనకు ఈ పదవి లభించిందన్నారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.

సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రోజురోజుకీ పెరుగుతున్న వాహన కాలుష్యం నిరోధించాలంటే సీఎన్జీ వినియోగం పెరగాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పరిధిలోని ఐనోలు గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన టోరెంట్ సీఎన్ గ్యాస్ స్టేషన్‌ను సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎన్జీ గ్యాస్ వినియోగిస్తే డబ్బు ఆదా కావడంతో పాటు కాలుష్య తీవ్రతను తగ్గించవచ్చన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంద్రేశం గ్రామ పరిధిలో ఇంటింటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందించేందుకు టోరెంట్ యాజమాన్యం శ్రీకారం చుట్టడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రేశం గ్రామ సర్పంచ్ నరసింహ, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి, డీఐ లల్లు నాయక్, టోరెంట్ గ్యాస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ మధుకర్ రావు, జనరల్ మేనేజర్ రాంబాబు, సీనియర్ నాయకులు రామచంద్రా రెడ్డి, శంకర్ రెడ్డి, శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి, నాణ్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాజ్‌కుమార్

నారాయణఖేడ్: పాలశీథలీకరణ కేంద్రంలో పాల ఉత్పత్తిదారులకు పాల ఉత్పత్తి, నాణ్యతపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. విజయాడైరీ క్వాలిటీ కంట్రోల్ హెచ్‌డీవో రాజ్‌కుమార్ పశుపోషణ, సొసైటీల ఏర్పాటు, నిర్వహణ, నాణ్యమైన పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలు, జిల్లాలో విజయాడైరీ ద్వారా అందజేస్తున్న పథకాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం నాణ్యమైన పాలను ఉత్పత్తి చేస్తున్న పలువురు పాల ఉత్పత్తిదారులను శాలువాలతో సన్మానించారు. పశువైద్యాధికారి నేతాజీ, పాలశీథలీకరణ కేంద్రం మేనేజర్ రాములు, ఫీల్డ్ అసిస్టెంట్లు సంగారెడ్డి, ప్రకాష్, విఠల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



జలాధివాసం చేస్తున్న పీఠాధిపతి మాధవానంద సరస్వతి

వట్‌పల్లి(అందోల్): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దేవునూర్ గ్రామంలో భ్రమరాంభిక, మల్లికార్జునస్వామి ఆలయ పునఃనిర్మాణ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతిష్ఠ విగ్రహాల ఊరేగింపు..

ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు భ్రమరాంభిక, మల్లికార్జున, శివపంచాయతన విగ్రహాలను ఊరేగించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం జనజాతరను తలపించింది. ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యా వచనం, యాగశాల ప్రవేశం, జలాధివాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

పరిశ్రమల సహకారం అభినందనీయం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



శ్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో గుమ్మడిదల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన శ్లాబ్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాపర్తిలో బోనాల ఊరేగింపు



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని రాపర్తిలో సోమవారం బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఎల్లమ్మ జాతర ప్రారంభించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీరెడ్డి మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు. ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంద శ్రావణ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సాయిబాబాగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వికలాంగుడికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎన్‌ఎంఆర్ యువసేన నాయకులు

జోగిపేట(అందోల్): మండల పరిధిలోని కన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కుమారుడు వికలాంగుడు రమేష్‌కు పటాన్‌చెరువు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ చేయూత అందించారు. ఈశ్వరయ్య కుటుంబం కష్టాలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో రమేశ్ ఇంటికి వెళ్లి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ కుటుంబ సభ్యులు నీలం మధు ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదాగౌడ్, ఎన్ఎంఆర్ యువసేన నాయకులు ప్రదీప్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు రమేష్ ముదిరాజ్, గోవర్ధన్ ముదిరాజ్, రాములు ముదిరాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

జోగిపేట(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలను వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్ అన్నారు. సోమవారం జోగిపేటలో టీపీటీఎఫ్ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరాల నుంచి బదిలీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జూలై 2023 నుంచి పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ సాయిలుచారి, అందోల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రప్రకాశ్, సర్వరాజ్ అలీ, చంద్రశేఖర్, సంజీవయ్య, సీరాజ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అందుబాటులో జీలుగ విత్తనాలు**

రాయికోడ్(అందోల్): వానాకాలం పంటల సీజన్‌కు సంబంధించి రైతులకు పంపిణీ చేసేందుకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల జీలుగ విత్తనాల బస్తాను రూ.843లకు అందజేస్తామన్నారు. అవసరమున్న రైతులు తమ పట్టాపాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో స్థానిక ఏఈఓను సంప్రదించాలని సూచించారు.

◆ **కాముని చెరువులో పూడికతీత పనులు**

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకంలో భాగంగా కల్హేర్‌లోని కాముని చెరువులో సోమవారం పూడికతీత పనులను చేపట్టారు. 310 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. టీఏ తులసీరాం పనులు పరిశీలించారు. రైతులు పంట పొలాలకు పూడిక మట్టి తరలించుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ సూచించారు.

◆ **రామలింగేశ్వర ఆలయంలో పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామంలోగల రామలింగేశ్వర ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పరమ శివుడిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా భవానీ మాత విగ్రహ ప్రతిష్ఠ**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట తండాలో సోమవారం భవానీ మాత సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆవాహిత దేవతాపూజ,శిఖర కలశ ప్రతిష్ఠ, కలశ హోమం తదితర కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కుమారుడు చింతా సాయినాథ్ పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అరీఫొద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **బసవేశ్వరుని బోధనలు ముందుకు తీసుకెళ్తాం**



జహీరాబాద్ టౌన్: విశ్వగురు మహాత్మ బసవేశ్వరుడి బోధనలతో ముందుకు సాగేందుకు వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం ఏర్పాటుకు నిర్ణయించడమైందని కన్వీనర్లు తెలిపారు. పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో కన్వీనర్లు బస్వరాజ్, నాగేశ్వర్, డాక్టర్ సిద్దన్న, శాంతకుమార్ మాట్లాడారు. బసవేశ్వరుడి బోధనలు దేశ ప్రజలందరికి ఆదర్శప్రాయమన్నారు. త్వరలో వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు.

◆ **అంబలి పంపిణీ**

జోగిపేట(అందోల్): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ప్రయాణికులకు అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

◆ **పరామర్శ**

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి తల్లి రెండు రోజుల క్రితం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలుసుకుని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ అంజిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు బాబుపటేల్, బీఆర్ఎస్ యువత రాష్ట్ర నాయకులు సాయికుమార్, పార్టీ మండల అధ్యక్షులు పెద్దగోడి వడ్ల విజయ్ కుమార్, బస్వరాజ్‌పాటీల్ పాల్గొన్నారు.

◆ **వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరికలు**

జహీరాబాద్ టౌన్: వైఎస్సార్ తెలంగాణ పార్టీలో పలువురు యువకులు చేరారని జహీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి నరేశ్ తెలిపారు. మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామానికి చెందిన పలు రాజకీయ పార్టీలకు చెందిన యువకులు సోమవారం రాత్రి పార్టీలో చేరారని చెప్పారు. పార్టీని బలోపేతం చేస్తూ జహీరాబాద్‌లో జెండా ఎగురవేస్తామన్నారు.

◆ **నిరుద్యోగులు ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి**

జోగిపేట(అందోల్): నిరుద్యోగులు ఉపాధి మార్గాలు ఎంచుకోవాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం జోగిపేటలో దాకూరు గ్రామానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పి.జైపాల్ రెడ్డి, జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ ఉలువల మాధవి వెంకటేశం, పట్టణ కాంగ్రెస్ నాయకుడు ఉలవల సతీష్, మాజీ మార్కెట్ చైర్మన్ డీబీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



ధృవపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: స్వయం ఉపాధితో ప్రతిఒక్కరూ ఎదగాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. ఐకేపీ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 50 మంది నిరుద్యోగ యువతీ యువకులకు సోమవారం ధృవపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం ఉపాధిని పొందేందుకు ప్రభుత్వం కులవృత్తుల వారికి రూ.లక్ష చొప్పున నగదు ఆర్థికసాయం అందించనుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పోతన్‌పల్లి (ఎం) గ్రామంలో రూ.20లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే మాణిక్‌రావు



డీలక్స్ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ బస్సు సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ డిపోలో సోమవారం కొత్తగా మూడు డీలక్స్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చన్నారు. బస్సు సర్వీసును ప్రారంభించిన తరువాత ఎమ్మెల్యే స్వయంగా బస్సును నడిపారు. ఆర్టీసీ డిపో మేనేజర్ రజని కృష్ణ మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన డీలక్స్ బస్సులు జహీరాబాద్, బీదర్, హైదరాబాద్ మార్గంలో తిరుగుతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మొహియొద్దీన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయాలి

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): వచ్చే నెల జూన్ 2వ తేదీ నుంచి నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం అందోల్‌లోని క్యాంపు కార్యాలయంలో తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్‌తో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సందగ్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూజూన్ 2న జాతీయ పతకాలను ఆవిష్కరించాలని, జాతీయ నేతల విగ్రహాల వద్ద లైటింగ్‌లను ఏర్పాటు, తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్‌చైర్మన్ జైపాల్‌రెడ్డి, తహసీల్దార్లు వెంకటేశ్, కిష్టయ్య, శివకుమార్, లక్ష్మన్, రాధాబాయి. అరవింద్ సింగ్, ప్రభులు, రాజయ్య, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, బీఆర్ఎస్ నాయకుడు వీరారెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం



పటాన్‌చెరు: సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, సీఐ వేణు గోపాల్ రెడ్డి.



న్యాల్‌కల్(జహీరాబాద్) సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి ముంగి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమరాలను జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. ముంగి ప్రధాన చౌరస్తా కావడంతో అక్కడ సీసీ కెమరాలను ఏర్పాటు చేయాలని హద్నూర్ పోలీసులు భావించారు. ముంగి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ షకీల్‌ను కెమరాల ఏర్పాటు కోసం సహకరించాలని సీఐ వెంకటేశం, ఎస్ఐ వినయ్‌కుమార్ కోరారు. అందుకు ఆయన అంగీకరించారు. సొంత డబ్బు సుమారు రూ.60 వేలు ఖర్చు చేసి నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని సోమవారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు.

ఒక సీసీ కెమెరా వంద మందితో సమానం

పటాన్‌చెరు టౌన్: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రూ.4.50 లక్షల సొంత నిధులతో ఏర్పాటుచేసిన 40 సీసీ కెమెరాలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, క్రైం సీఐ లాలూ నాయక్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ఇక్రిశాట్ కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్ట్ కార్మికులు మాట్లాడారు. తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. శ్రమకు తగ్గ వేతనం రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టపరంగా రావాల్సిన సౌకర్యాలను కల్పించాలని అడిగినందుకు కొంత మందిని విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.